ఘనంగా హనుమాన్ జయంతి 8లో..

సుందిళ్ల కేంద్రంగా మట్టి మాఫియా 8లో..



ఊపందుకోని ప్రచారం

- పట్టణాలు, గ్రామాల్లో వినిపించని మైకుల హోరు
- పార్టీ సమావేశాలతోనే సరిపెట్టుకుంటున్న అభ్యర్థులు
- పెద్దపల్లిలో కానరాని పార్లమెంట్ ఎన్నికల సందడి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఈనెల 25న ముగియనుంది. ఇప్పటివరకు కూడా ఎన్నికల ప్రచారం ఊపందుకోకపోవడంతో ఎన్నికల సందడి కానరావడం లేదు. దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలను ఏడు విడతల్లో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ మార్చి 16న షెడ్యూల్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. అప్పటినుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. 4వ విడతలో మన రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాలు, ఒక అసెంబ్లీకి ఉప ఎన్నిక ఒకే రోజు నిర్వహిస్తామని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఆ మేరకు ఈనెల 18వ తేదీన నామినేషన్ల దాఖలుకు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. నామినేషన్ల గడువు 25వ తేదీ నాటికి ముగియనుండగా, పోలింగ్ వచ్చేనెల 13వ తేదీన జరగనున్నది. ఇప్పటివరకు 33 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇంకా నామినేషన్ల గడువు ముగిసేందుకు ఇంకా రెండు రోజుల సమయం ఉన్నది. ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీజేపీ నుంచి గొమాసే శ్రీనివాస్ పేరును ప్రకటించారు. అయితే ఎవరికి వారుగా తామే గెలుస్తామనే ధీమాతో ఉన్నారే తప్ప ఇప్పటివరకు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రచారం నిర్వహించ లేదు. కేవలం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ, మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. అలాగే కార్మిక సంఘాలు, వివిధ సంఘాలతో సమావేశాలు నిర్వహించి తమ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఓటర్లకు ఇప్పటివరకు ఏ పార్టీ నుంచి ఏ అభ్యర్థి పోటీ చేస్తున్నారనే విషయం తెలియకుండా పోతున్నది. ఎవరు కూడా ప్రచార సామగ్రిని సిద్ధం చేసుకోకపోవడం గమనార్హం.

● నాలుగు జిల్లాల్లో..

పెద్దపల్లి పార్లమెంట్ నాలుగు జిల్లాల్లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు విస్తరించి ఉన్నది. ఈ క్రమంలో అభ్యర్థులకు పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులను కోఆర్డినేట్ చేసుకోవడానికే సమయం సరిపోవడం లేదు. దీనికి తోడు ఎండలు మరింత దంచి కొడుతుండడంతో ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేసేందుకు జంకుతున్నారు. రోడ్‌షోలు, ర్యాలీలు, బహిరంగ సభలకు ఎన్ని డబ్బులు ఇచ్చినా ప్రజలు వచ్చే పరిస్థితి కనబడడం లేదు. ఎండదెబ్బ తగిలి మృతిచెందితే ఆ కుటుంబాలను ఆదుకునే వాళ్లు ఎవరు ఉండరని భావిస్తున్న ప్రజలు సైతం ప్రచారంలో పాల్గొనేందుకు ఉత్సుకత ప్రదర్శించడం లేదు. ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసిన అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లను ప్రకటించనున్నారు. పోటీలో 16 మంది అభ్యర్థులకు మించితే మాత్రం ఒక్కో పోలింగ్ బూతులో రెండు ఈవీఎంలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం కేవలం 14 రోజులు మాత్రమే మిగిలి ఉంటుంది. ఈ సమయం అభ్యర్థులకు ఏమాత్రం సరిపోదు. కనీసం నియోజకవర్గ పరిధిలోని పట్టణాలు, పెద్ద గ్రామాల్లో కూడా ప్రచారం చేసే పరిస్థితి ఉండదు. కనీసం కింది స్థాయి క్యాడర్ కూడా పనిచేసే విధంగా వారిని కార్యోన్ముఖులను చేయడం లేదు. తాము గెలిస్తే నియోజకవర్గంలో తాము చేసే అభివృద్ధి పనులు, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల గురించి హామీ ఇవ్వాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కనబడ్డ ఎన్నికల ప్రచార హడావుడి ఈ ఎన్నికల్లో కనబడడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క గ్రామాన్ని, పల్లెకు వదిలిపెట్టకుండా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు స్వయంగా ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. కానీ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని పట్టణాలు, గ్రామాల్లో కాకపోయినా ప్రధాన గ్రామాల్లో కూడా ప్రచారం చేయలేని దుస్థితి. ఇప్పటివరకు వాహనాలకు మైకులు పెట్టి నిర్వహించే ప్రచారానికి సంబంధించి అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తీసుకున్నట్లుగా కనబడడం లేదు. ప్రచారంలో వెనుకబడితే పోలింగ్ శాతం తగ్గి గెలుపోటములు తారుమారయ్యే అవకాశాలున్నాయి.

మరో పదకొండు మంది నామినేషన్లు

- 33కు చేరుకున్న అభ్యర్థుల సంఖ్య

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి (ఎస్సీ రిజర్వుడు) పార్లమెంటు స్థానానికి మంగళవారం మరో 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఇప్పటి వరకు అభ్యర్థుల సంఖ్య 33కు చేరుకున్నది. స్వతంత్ర అభ్యర్థులుగా దూడ మహిపాల్ (రెండవ సెట్), తాళ్లపల్లి నరేష్, రాచర్ల రాజేశం, ఇరికిల్ల రాజేష్, కట్కూరి సందీప్ (రెండవ సెట్), సోల్లు రంజిత్, యువతరం పార్టీ అభ్యర్థిగా చిలుక ఆనంద్, పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) అభ్యర్థిగా మోతె నరేష్ (రెండవ సెట్), అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా అంబోజు సుమలత, బీఎస్పీ అభ్యర్థిగా ఇరుకుల్ల రాజ నర్సయ్య, సోషలిస్టు పార్టీ ఇండియా) అభ్యర్థిగా ములకల కనకయ్య తలా ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని, ఇప్పటివరకు ఐదు రోజుల్లో 33 మంది అభ్యర్థులు 42 సెట్లలో నామినేషన్‌లు దాఖలు చేసినట్లు పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. నామినేషన్ల దాఖలుకు ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు సమయం ఉంది. బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ

పాలకుర్తి, ఏప్రిల్ 23: చెక్‌పోస్టుల వద్ద అధికారులు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ షిఫ్టుల వారిగా విధులు నిర్వహించాలని, నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలని అదనపు కలెక్టర్ జె అరుణ శ్రీ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని వేంనూర్ వద్ద ఏర్పాటుచేసిన చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెక్ పోస్టు వద్ద సీసీ కెమెరాలు 24 గంటలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, షిఫ్టుల విధానంలో అధికారులు విధులు నిర్వహించాలని, పోలీస్ అధికారులు, సర్వేలెన్స్ బృందాలు సమన్వయంతో పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతి వాహనాన్ని ప్రజలకు ఇబ్బంది కలగకుండా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పైఅధికారులు తనిఖీచేసే సమయంలో రికార్డులు చూపించాలని, పకడ్బందీగా రికార్డ్ నిర్వహణ చేయాలన్నారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీలలో నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, జప్తు చేసిన నగదును రిజిస్టర్‌లో నమోదు చసి రసీదు తప్పని సరిగా అందజేయాలని అరుణ శ్రీ సూచించారు.ఆమె వెంట స్థానిక ఎంపిడివో పోల్సాని శశికళ,తాహసీల్దార్ ఎం జ్యోతి,సీనియర్ అసిస్టెంటు పూర్ణచందర్ రావు తదితరులున్నారు.

ఎల్లంపల్లి చెక్‌పోస్టు తనిఖీ

అంతర్గాం, ఏప్రిల్ 23: మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్దగల చెక్‌పోస్టును మంగళవారం అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చెక్ పోస్టు వద్ద అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు. చెక్ పోస్టు వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రికార్డులు పకడ్బందీగా నిర్వహణ చేపట్టాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలన్నారు. తహసీల్దార్ పీ రాంమోహన్‌రావు, ఎంపీడీవో అలీమ్, రెవెన్యూ, పం చాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఆర్డీవో



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఆర్‌డీవో

మంథని, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని ఎక్లాస్‌పూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంథని ఆర్డీవో, ఏఆర్‌వో హనుమానాయక్ మంగళవారం తనిఖీ చేశారు. భద్రతా నిమిత్తం ప్రతీ చెక్‌పోస్టులో సీసీ టీవీ కెమెరాలను అమర్చడం జరిగిందని తెలిపారు. తాగునీటి సదుపాయం, కూలర్ల ఏర్పాటును పరిశీలించారు. చెక్‌పోస్టు సిబ్బంది జిల్లా సరిహద్దు నుంచి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, రూ.50వేల నగదు కంటే ఎక్కువగా ఉంటే సీజ్ చేయాలని, సీజ్ చేసిన నగదుకు రసీదు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. సీజ్ చేసిన నగదుకు తగిన ఆధారాలు, రసీదులు చూపిస్తే నిబంధనల క్రమంలో నగదు రిలీజ్ చేస్తామన్నారు. సరిహద్దు చెక్‌పోస్టు వద్ద లిక్కరు అక్రమ రవాణా చేస్తే వెంటనే సీజ్ చేసి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టులో సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేయాలి

- జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్‌రెడ్డి



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఎంవో ప్రవీణ్‌రెడ్డి

ధర్మారం, ఏప్రిల్ 23: రైతుల ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని మల్లాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యం తీసుకువచ్చిన తర్వాత వెంటనే తేమ శాతాన్ని పరిశీలించి కొనుగోలు చేయాలని ఆయన చెప్పారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఏఈవో శివ, మార్కెట్ సిబ్బంది ఏదుల్లా రాజారాం, రైతులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కోతలు లేకుండా చర్యలు

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

పాలకుర్తి, ఏప్రిల్ 23: మండలం పరిధిలోని బసంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని త్వరగా మద్దతు ధరపై కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తడిసిపోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలవద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే వరకు పూర్తి బాధ్యత కేంద్రాల నిర్వాహకులదే ఉంటుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు తరలించాలని, రైస్ మిల్లుల వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కోత కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లలో నమోదు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల సమయాన్ని వృథా చేయవద్దు

- జిల్లా విద్యాధికారి మాధవి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

ధర్మారం, ఏప్రిల్ 23: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఆటలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాధికారి మాధవి చెప్పారు. మంగళవారం మండలంలోని కటికెనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్, టీవీలను అతితక్కువగా వినియోగిస్తూ శరీరానికి వ్యాయామం అందించే ఆటలపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత యూనిఫాం, ఉచిత పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, టిఫిన్, మధ్యాహ్న భోజనం, గుణాత్మక విద్యను అందించడంతో పాటు విద్యార్థుల్లో నెలకొన్న అంతర్గత నైపుణ్యాలను పెంపొందించేందుకు వినూత్నమైన కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఆమె చెప్పారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నూతి మల్లయ్య, నిమ్మల రేవతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ రామడుగు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

డీపీవో ఆకస్మిక తనిఖీ

రామగిరి, ఏప్రిల్ 23: మండలంలోని కల్వచర్ల గ్రామంలోని పలు వాడల్లో డీపీవో ఆశాలత మంగవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యలు, నీటి ఎద్దడి లేకుండా అధికారులు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శంకర్ ఎంపీవో సమ్మిరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కోతలు లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు

- ఇప్పటి వరకు 16,704 టన్నుల ధాన్యం కొనుగోలు - డీఎస్‌వో ప్రేమ్ కుమార్

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎలాంటి కోతలు లేకుండా ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నామని డీఎస్‌వో ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 311 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆరంభించామని తెలిపారు. ఇందులో 176 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 22 వరకు 15 కోట్ల రూపాయల విలువైన 16,704.088 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని 15,632 టన్నుల ధాన్యాన్ని మిల్లులకు పంపించామని తెలిపారు. గత ఏడాది యాసంగిలో ఈ సమయానికి కేంద్రాల్లో కొనుగోళ్లు సాగలేదన్నారు. ముందస్తుగానే ఈసారి కేంద్రాలను ఆరంభించామన్నారు. ఈ సీజన్‌లో 3 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, జిల్లాలో 6 లక్షల టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసే 131 పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు కేంద్రాలను కేటాయించామన్నారు. రైతులకు డబ్బులు చెల్లించేందుకు 41 శాతం ఆన్‌లైన్ పూర్తయ్యిందని, ఇప్పటి వరకు 6 శాతం మంది రైతులకు 2.18 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతులు వరి కోసిన వెంటనే ధాన్యాన్ని నేరుగా తీసుక వచ్చి కేంద్రాల్లో కుప్పలు పోస్తున్నారని, తేమ శాతం 19కి మించి ఉంటున్నదని, 19శాతం లోపు ఉన్న ధాన్యాన్ని తూకం వేస్తున్నామని తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు 2203, సాధారణ రకం ధాన్యానికి 2183 రూపాయలు చెల్లిస్తున్నామన్నారు. కేంద్రాలకు రైతులు తీసుక వచ్చిన ధాన్యాన్ని ప్రతి రోజు తేమ శాతం కొలిచి రిజిష్టర్‌లో నమోదు చేస్తున్నామన్నారు. అలాగే ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రైస్ మిల్లుకు కేంద్రం నుంచి ట్రక్ షీట్ వెళ్లిన ప్రకారమే రైతులకు చెల్లింపులు చేస్తున్నామన్నారు. రైస్‌మిల్లర్లు కోతలు విధించకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎక్కడైనా కేంద్రాల నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేసినట్లయితే తమదృష్టికి తీసుకరావాలని డీఎస్‌వో ప్రేమ్ కుమార్ తెలిపారు.

రామగుండానికి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ - కాంగ్రెస్‌లో చేరిన మాజీ మేయర్ జాలి రాజమణి



మాజీ మేయర్ జాలి రాజమణికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని, ఏప్రిల్ 23: రామగుండానికి పూర్వవైభవం తీసుకువస్తానని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. మంగళవారం మాజీ మేయర్ జాలి రాజమణి వంద మంది అనుచరులతో కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దీటి బాలరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50ఏళ్ల క్రితం రామగుండం గ్రేటర్ కమ్యూనిటీగా ఉండేదని, రానురాను ఇక్కడ పరిశ్రమలు మూతపడుతుండడంతో జనాభా తగ్గుతుందని, మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరుపొందిన రామగుండంలో ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, ఇక్కడ యువకులు ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నారన్నారు. మాంచెస్టర్ అంటే లండన్ అని, లండన్‌లో పరిశ్రమలు ఎక్కువగా ఉండేదని, ఆ తరువాత దేశంలో ఎక్కడా లేని పరిశ్రమలు రామగుండంలో ఉండేవని, రామగుండానికి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇక్కడ కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యాపారాల అభివృద్ధికి త్వరలోనే శ్రీకారం చుట్టనున్నట్టు చెప్పారు. 3500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేద వారికి ఇవ్వనున్నట్టు, గతంలో ఇద్దరు ఎమ్మెల్యేలు డ్రాలో ఎంపిక చేసినా లబ్ధిదారులకు మాత్రం ఇప్పటివరకు ఇళ్లు రాలేదని, చాట్లో తౌడు పోసి కొట్లాట పెట్టించారే తప్ప చేసిందేమి లేదన్నాని, ఈ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో కూడా అవినీతి జరిగిందని ఆరోపించారు. 600 మందికి డ్రాలో ఎంపిక చేశారని, వారికి త్వరలోనే ఇండ్ల కేటాయింపు పారదర్శకంగా చేయనున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లోనే 5గ్యారంటీ పథకాలను ప్రవేశ పెట్టిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగంగా ఉందని, గృహజ్యోతితో విద్యుత్‌ను కూడా ఉచితంగా ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, దుబాసి లలిత, కాంగ్రెస్ నాయకులు తిప్పారపు శ్రీనివాస్, మారెల్లి రాజిరెడ్డి, కటుకు ధనుంజయ్, కళ్యాణి సింహాచలం, గట్ల రమేష్, కల్వల రంజిత్, శ్రీనివాస్, కుడిదెల శివ, అల్లి శంకర్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో మళ్లీ మోసం చేయాలని చూస్తున్న కాంగ్రెస్

- జడ్పీ చైర్మన్ పుట్ట మధు



కార్డులను పోస్టు చేస్తున్న పుట్ట మధు, బీఆర్ఎస్ నాయకులు

మంథని, ఏప్రిల్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం మరో మారు పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ప్రజలను మరోమారు మోసం చేయాలని చూస్తోందని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు ఆరోపించారు. పార్టీ పిలుపు మేరకు స్థానిక ఏఎంసీ మార్కెట్ యార్డులో రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి ఓరుగంటి వెంకటరమణారావుతో కలిసి పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆరు గ్యారెంటీలను హామీలను ఒక్కటి అమలుచేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీ ఎన్నికల్లో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడి కొనుగోలు విధానాన్ని, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీలు ఇచ్చిందని మరి ఇంకా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతులకు రూ.ఐదు వందల బోనస్, రూ.15 వేల రైతుబంధు, రుణమాఫీ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. డిసెంబరు 9న రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి చేయలేదని, మళ్లీ జనవరి 6వ తేదీన నెలరోజుల్లో రుణమాఫీ చేస్తామని చెప్పారని అంటే ఫిబ్రవరి 6వ తేదీ వరకు రుణమాఫీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కనీసం రైతు రుణమాఫీ ప్రక్రియను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కరెంట్, సాగు, తాగునీటి సమస్యలు ఎక్కువ అయ్యాయన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీళ్లు ఉంచుకొని కూడా రైతులకు నీళ్లు ఇవ్వలేదన్నారు. దీని వల్ల జిల్లాలోనే వేల ఎకరాల్లో రైతులు వరి పంటను నష్టపోతే ఓ మంత్రి రాష్ట్రంలో కేవలం 3 వేల ఎకరాల్లో మాత్రమే నష్టం జరిగిందనడం బాధాకరమన్నారు. మంథని నియోజకవర్గంలోనే 3వేల ఎకరాల వరకు నష్టపోయిన ఆశ్చర్యం లేదన్నారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని కానీ ప్రజలు వారిని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. దేశంలో ఇప్పటి వరకు దేవుళ్లపై ఓట్లు పెట్టి హామీలను అమలు చేస్తానని చెప్పిన సీఎంలు లేరని, ఆ ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తెలంగాణలో మాత్రం రేవంత్‌రెడ్డి మాటకు విలువ లేకుండా పోయిందన్నారు. అందుకే యాదగిరిగుట్టకు వెళ్లి దేవుడి మీద ప్రమాణం చేసి చెప్తున్నా హామీలను అమలు చేస్తానని ప్రజలకు మాట ఇస్తున్నాడన్నారు. గతంలోని బీఆర్ఎస్ పాలనను, ప్రస్తుత కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్ గౌడ్, తగరం శంకర్‌లాల్, గొబ్బూరి వంశీ, వేల్పుల గట్టయ్య, మాదాడి శ్రీనివాస్‌రెడ్డి, మంథని లక్ష్మణ్, లోడారి రాములు పాల్గొన్నారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

సూర్యరథంపై కొలువుదీరిన రాములోరు


ఇల్లందకుంటలో శోభాయాత్ర


సూర్యరథంపై స్వామివారు


ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

● ఇల్లందకుంటలో వైభవంగా శకటోత్సవం

ఇల్లందకుంట, ఏప్రిల్ 23: ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా సూర్యరథం (చిన్న రథం)పై స్వామివారు కొలువుదీరారు. మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజ కార్యక్రమం అనంతరం శకటోత్సవం పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు (ఎడ్ల బండ్లు) ప్రదర్శనతో ఆలయం తిరుమాడ వీధుల గుండా ప్రదర్శన చేశారు. స్వామివారిని చిన్నరథంపై కొలువుదీర్చగా ఆలయ మాడ వీధుల గుండా డప్పుచప్పుళ్లు, మంగళవాయిద్యాలు, మేళా తాళాల నడుమ రామనాస్మరణ చేస్తూ ఊరేగించారు.

సైదాబాద్ గ్రామం నుంచి వచ్చిన మేకల బండ్లు ఆలయ మాడ వీధుల గుండా ప్రదర్శించారు. చిన్నరథంపై విహారిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

యువకుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 23: సిరిసిల్ల పట్టణంలోని బోయవాడకు చెందిన మానుకోల మనోజ్‌కుమార్ (26) అనే యువకుడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి వివరాల ప్రకారం.. పట్టణంలోని బోయవాడకు చెందిన మనోజ్‌కుమార్ అగ్రహారం సమీపం లోని ఓ కారు సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 21న మనోజ్ తల్లిదండ్రులు ఓ పెళ్లికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వెళ్లారు. పెళ్లికి వస్తానని తల్లిదండ్రులకు చెప్పిన మనోజ్ సోమవారం అర్ధరాత్రి తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవన్మరణానికి ఒడిగట్టాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఇంటి తలుపులు తీయడం లేదని పక్కింటివారు పిలిచినా ఎవరూ కనిపించకపోవడంతో తలుపులు తీసి లోపలికి వెళ్లిచూస్తే బెడ్‌రూంలో మనోజ్ శవమై కనిపించాడు. ఈ విషయాన్ని వెంటనే అతని తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించారు. మనోజ్ మృతిచెందాడని తెలుసుకున్న తల్లిదం డ్రులు, సోద రుడు హైద్రాబాద్ నుంచి వచ్చారు. తమ కుమారుడు మనోజ్‌కు గత మూ డు నెలలుగా కార్ల కంపెనీలో వేతనం ఇవ్వకపోవడం వల్లనే మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. కాగా మనోజ్ లోన్‌యాప్ వేధింపుల వల్లనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని సోషల్ మీడియాలో వైరల్ అయింది.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 23 : డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురు వ్యక్తులకు 3 రోజుల జైలు శిక్ష పడినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. మోతాదుకు మించి మద్యం సేవించి తనిఖీలలో ఇటీవల పట్టుబడిన 20 మంది వాహనదారులను మంగళవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఐదుగురు వ్యక్తులకు 3 రోజులు జైలుశిక్ష, 10 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు. మిగతా 15 మంది వాహనదారులకు 27,500 రూపాయల జరిమానా విధించారన్నారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 23: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 20మంది రైతులు 323క్వింటాళ్ల విడి పత్తి, తొమ్మిది మంది రైతులు 16క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.5,800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ధర్మారంలో నగదు పట్టివేత

ధర్మారం,ఏప్రిల్23: ధర్మారం మండల కేంద్రంలోని జక్కన్నపల్లి రాష్ట్ర రహదారిపై మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏపీ09టిఎ5072 వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఉన్న కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామానికి చెందిన దొమ్మట రాములు అనే వ్యక్తి వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రూ.98,500నగదును స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి యువకుడు మృతి


దేవేందర్ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 23: ద్విచక్ర వాహనం నుంచి పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండల శివారులో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని మల్యాల గ్రామ పరిధిలోని జగ్గయ్యపల్లెకు చెందిన ఉప్పుల దేవేందర్ (35) సోమవారం రాత్రి తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై జగ్గయ్యపల్లె నుంచి కాల్వ శ్రీరాంపూర్‌కు వచ్చి అదే రోజు రాత్రి తిరిగి వెళుతుండగా మండల కేంద్రం శివారులోని రహదారిపై ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం నుంచి పడి ఉప్పుల దేవేందర్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం మృతి చెంది ఉన్న ఉప్పుల దేవేందర్‌ను చూసి కుటుంబ సభ్యులకు గ్రామస్థులు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య జ్యోతితో పాటు కుమారుడు ఉన్నాడు. దేవేందర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు.

రెండు కార్లు ఢీ : తప్పిన ప్రమాదం

మానకొండూర్, ఏప్రిల్ 23 : మండలంలోని రంగపేట గ్రామ శివారులో మంగళవారం రెండు కార్లు ఢీకొన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగపేట గ్రామానికి చెందిన మహేందర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి తన ఇంటికి టిఎస్12ఈడబ్ల్యూ 3994 నెంబరు గల కారులో వస్తుండగా వీణవంక మండలంలోని ఎలబాక గ్రామానికి చెందిన గణేష్ టిఎస్02 ఎఫ్ఈ2505 నెంబరు కారులో వెల్ది నుంచి రంగపేటకు వస్తున్నాడు. మూలమలుపు వద్ద రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవ్వరికి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పినప్పటికి కార్లు ధ్వంసం అయ్యాయి.

రెండు ఇసుక ట్రాక్టర్లు ఢీ : ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 23 : మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో రెండు ఇసుక ట్రాక్టర్లు ఢీకొన్న ప్రమాదంలో ఒక్కరికి తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని లింగాపూర్ మానేరు వాగు నుంచి ఇసుకను కరీంనగర్‌లో అన్‌లోడ్ చేసి తిరిగి వస్తున్న ట్రాక్టర్, మానేరు వాగు నుంచి ఇసుకతో వెల్లుతున్న మరో ట్రాక్టర్‌ల డ్రైవర్‌లు అతివేగంగా నడుపుతూ జగ్గయ్యపల్లి వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లింగాపూర్‌కు చెందిన రమేశ్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పాలకుర్తి,ఏప్రిల్ 23: కన్నాల గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఆ ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు గుర్తుతెలియని మృతదేహాన్ని చూసి కన్నాల గ్రామ పంచాయతీ సెక్రెటరీకి చెప్పారని,అతను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు.సెక్రెటరీ ఆషాడపు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సుమారు 50,60 సంవత్సరాల మధ్య ఉంటుందని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో చెట్టుకుఉరి వేసుకొని వేలాడుతూ ఉందన్నారు. గుర్తుపట్టిన వారు బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

బాబ్లీ కోర్టుకు హాజరైన తెలంగాణ ఎమ్మెల్యేలు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23: తెలంగాణ రైతుల భూములు సాగునీరు లేక ఎడారిగా మారుతుంటే చూడలేక సాగునీటి కోసం పోరాటంలో భాగంగా మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు వద్ద ఆందోళనకు దిగిన కేసులో తెలంగాణకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కోర్టుకు హాజరయ్యారు. బాబ్లీ కేసు విచారణలో భాగంగా మంగళవారం మహారాష్ట్రలోని బాబ్లీ సెషన్ కోర్టుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, చింతకింది విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యేలు హనుమంతు షిండే, కెఎస్ రత్నం హాజరయ్యారు. అయితే బాబ్లీకి వ్యతిరేకంగా నాడు చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన పాల్గొన్న టిడిపి ఎమ్మెల్యేలు ప్రస్తుతం వేర్వేరు పార్టీలో కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా వారు కోర్టులో కలుసుకొని పాత జ్ఞాపకులను గుర్తు చేసుకున్నారు.

యువకుడి దారుణ హత్య


మహిపాల్‌రెడ్డి

మల్యాల, ఏప్రిల్ 23: మండలంలోని రాజారం శివారులో గల ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. మల్యాల ఎస్సై అబ్దుల్ రహీం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేటకు చెందిన ముస్కు మహిపాల్ రెడ్డి(35) అనే యువకుడు చికెన్ సెంటర్‌లలో దినసరి కూలిగా పని చేస్తుంటాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన మహిపాల్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. మంగళవారం రాజారం ఎస్సారెస్పీ కెనాల్ వద్ద అతని మృతదేహం అనుమానాస్పద స్థితిలో కనిపించింది. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఆనవాళ్లు గుర్తు పట్టకుండా దహనం చేయడంతో పాటు మృతదేహంపై అరటి పళ్ల డబ్బాలు పెట్టారు. మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బ్యాంక్ లాకర్ మీద పడి ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో నూతనంగా బిగించేందుకు తీసుకువచ్చిన లాకర్‌ను మంగళవారం వాహనంలో నుంచి దింపుతున్న క్రమంలో మీదపడి ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తి పరమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాలు నుజ్జునుజ్జయింది. బ్యాంకులో బంగారం దాచుకునేందుకు లాకర్‌ను ఏర్పాటు చేయడం కోసం బ్యాంకు అధికారులు హైదరాబాద్‌లోని వ్యాపారి వద్ద కొనుగోలు చేశారు. వాహనంలో తీసుకు వచ్చిన లాకర్‌ను దింపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు పరమేశ్‌పై పడింది. 20 టన్నుల బరువు కల్గిన లాకర్ మీద పడడంతో సుమారు రెండు గంటల పాటు కింద ప్రాణాలతో కొట్టుమిట్టాడాడు. స్థానికులు జేసీబీ తెప్పించి వ్యక్తి పైనున్న లాకర్‌ను తొలగించారు. గాయాలపాలైన పరమేశ్‌ను మొదట సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

మతి స్థిమితం లేని యువతిపై వృద్ధుడి అత్యాచారం

ఓదెల ఏప్రిల్ 23: ఓదెల మండల కేంద్రంలో మంగళవారం మతి స్థిమితం లేని యువతిపై అదే గ్రామానికి చెందిన రాచర్ల రాజమల్లు (70) అనే వృద్ధుడు అత్యాచారానికి పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు. యువతి కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పనులకు వెల్లగా ఇంటిలో ఒంటరిగా ఉన్న యువతిపై కన్నేసిన ప్రబుద్ధుడు యువతిపై అత్యాచారం చేశాడు. ఇంతకు ముందు కుడా సదరు యువతిని లైగిక వేధింపులకు గురిచేయగా కాలనీవాసులు బుద్ధి చెప్పారు. యువతి కుటుంబ సభ్యులు ఉపాధి పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన తర్వాత యువతి తన తల్లికి జరిగిన సంఘటనను వివరించింది. బాధిత కుటుంబం పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఎస్‌యూ పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 23: శాతవాహన యూనివర్సిటీ పీజీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

కొండగట్టు కాషాయమయం

● ఘనంగా హనుమాన్ చిన్న జయంతి ●స్వామిని దర్శించుకున్న వేలాది భక్తులు


ముడుపు కడుతున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 23: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం హనుమాన్ చిన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జయంతి సందర్భంగా తరలివచ్చిన భక్తజనంతో కొండగట్టు కిక్కిరిసింది. అంజన్న దీక్షాపరుల సంకీర్తనలతో స్వామి పరిసరాలు భక్తి పారవశ్యంతో పులకించాయి. అంజన్న దీక్షాపరులతో కొండగట్టు పుణ్యక్షేత్రం మంగళవారం రాత్రి కాషాయవర్ణాన్ని పులుముకుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో అంజన్న దీక్షాపరులు కొండపైకి చేరుకుని 41, 21, 11 రోజుల దీక్ష బూనిన వారు మాల విరమణ చేశారు. ఘాట్ రోడ్డు, మెట్లదారుల గుండా వచ్చిన దీక్షాపరులతో కొండంతా భక్తజనంతో నిండింది.

కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా చైత్ర పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ఈ జయంతిలో భాగంగా అంజన్నకు విశేష అభిషేకం, తులసీ అర్చన, శ్రీ స్వామివారికి పట్టు వస్త్రాలంకరణ నిర్వహించారు. ఈవో చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్ స్వామి, రఘు ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, మారుతీ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాల విరమణ చేసిన భక్తులు స్వామి వారికి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

● ఎండలు.. ఎన్నికలు..

ఇటీవల వేసవి ఎండలు దంచి కొడుతుండడంతో పాటు లోక్‌సభ ఎన్నికల ప్రభావం హనుమాన్ భక్తులపై పడినట్లైంది అయింది. దీక్షాపరులు, భక్తుల రద్దీ కాస్త తగ్గింది. గతంలో హనుమాన్ జయంతి రోజు, ఒక్క రోజు ముందు లక్షలాదిగా భక్తులు తరలి రాగ ఈ సారి వేలల్లో రావడం ఎండల ఎఫెక్ట్‌గా పేర్కొంటున్నారు. రెండు నెలల క్రితం జరిగిన సమ్మక్క సారక్క జాతర సమయంలో లక్షలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకోగా ప్రస్తుత సమీప ఆలయాల్లోనే మాల విరమణ చేసినట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుచున్నాయి.

● జయంతిలో పాల్గొన్న కమిషనర్

హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల సందర్భంగా దేవాదాయ కమిషనర్ హనుమంతరావు మంగళవారం జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకున్నారు. కొండపైన ఏర్పాట్లు పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కమిషనర్ వెంట ఆలయ ఈవో చంద్రశేఖర్, జాతర ప్రత్యేక అధికారి కృష్ణప్రసాద్, ఆర్డీవో మధుసూధన్ తదితరులు ఉన్నారు. అలాగే చిన్న జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అంజన్నను దర్శించుకున్నారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ కొండపైన పర్యటించి పోలీస్ బందోబస్తు చర్యలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా, చూడాలని పోలీస్ అధికారులకు సూచనలు చేశారు.


అంజన్న దీక్షాపరులు


రాత్రి వేళ ఆలయం వద్ద భక్తులు


ఆలయంలో భక్తులు


కొండగట్టులో దీక్షాపరులు

ఆర్టీసీ బస్సు కింద పడి భక్తుడి మృతి

కొడిమ్యాల, ఏప్రిల్ 23: కొండగట్టు ఆంజనేయస్వామి చిన్న జయంతి వేడుకల సందర్భంగా మంగళవారం అపశృతి చోటు చేసుకుంది. మండలంలోని దబ్బుతిమ్మయ్యపల్లి గ్రామ శివారులో బొజ్జ పోతన పార్కింగ్ ప్రాంతంలో మంగళవారం అసావత్ లక్ష్మన్(55) వేములవాడ డిపోకు చెందిన ఉచిత ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా కిందపడి తీవ్రగాయాలపాలైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. చేతులకు, తలకు తీవ్రగాయాలు కాగా అతనిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికె మృతి చెందాడని వైద్యులు చెప్పినట్లు ఎస్సై తెలిపారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఎనుగల్లు ఎన్.జీ తండాకు చెందిన అసావత్ లక్ష్మన్, అతని భార్య, కుమారుడు, కోడలు తదితరులు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు బస్సు ముందు చక్రాల కింద భక్తుడి కాళ్లు, చేతులు పడ్డాయి. చికిత్స కోసం 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు అసావత్ మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఘటనపై కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

రాజన్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

● రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

వేములవాడ, ఏప్రిల్ 23 : శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం వేములవాడకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్ర కళ్యాణోత్సవాన్ని రాజన్న క్షేత్రంలో ఘనంగా నిర్వహించారని అన్నారు. వేసవికాలంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగా మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. దేవాలయానికి సంబంధించిన గోశాలలో కోడెలు మృత్యువాత పడుతుండడం, కొన్ని కోడెలు గల్లంతవ్వడం వంటి విషయాలపై ప్రశ్నించగా తాను దేవాదాయ శాఖ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించానని తన దృష్టికి వచ్చిన అంశాలపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకుంటానని అన్నారు. ప్రస్తుతం తాను కేవలం శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం మాత్రమే వేములవాడకు వచ్చానని, ఇతరత్రా సమస్యలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ తదితరులు ఉన్నారు.


కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

● అంతకు ముందు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా, ఈఓ డి కృష్ణ ప్రసాద్ స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి

● బాలరాజుపల్లిలో రైతు, విలోచవరంలో ఉపాధి కూలీ మృతి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 23: వడదెబ్బతో మంగళవారం ఇద్దరు మృతి చెందారు. వేములవాడ మండలంలో ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు, కుటుంభ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన నాగుల బాలయ్య (55) సోమవారం వ్యవసాయ పనులలో భాగంగా వడ్లు ఆరబోయడానికి వెళ్లాడు. సాయంత్రం అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వేములవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మృతుడికి భార్య దేవేంద్ర, కొడుకు, కూతురు ఉన్నారు.

● మంథని రూరల్ : మండలంలోని విలోచవరం గ్రామంలో ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్లి వడదెబ్బతో అక్కపాక లక్ష్మి(55) మంగళవారం మృతి చెందింది. లక్ష్మి గ్రామ శివారులోని ఊర చెరువు వద్దకు పూడిక తీత పనులను ఉదయం 7 గంటల సమయంలో వెళ్లింది. పని ముగించుకొని ఇంటికి వెళ్దామనే సమయంలో సుమారు 10 గంటల సమయంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురై కింద పడిపోయింది. ఆమెను గమనించి తోటి కూలీలు నీళ్లు తాగించగా వాంతులు చేసుకుంది. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలికి భర్త లింగయ్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. వడదెబ్బతో మృతి చెందిన అక్కపాక లక్ష్మి పార్థివ దేహాన్ని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు సందర్శించారు. ఎంపీపీ కొండ శంకర్, ప్రజాసంఘాల నాయకులు బూడిద గణేష్, ఆర్ల సందీప్, గోరంకల సురేష్‌లతో పాటు తదితరులు సైతం మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకోవడంతో పాటు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీ లక్ష్మి మృతి చెందడంతో సంఘటన స్థలాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్‌రాథోడ్, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు సత్యనారాయణ, అమృత్‌కుమార్ పరిశీలించారు.

ఓడేడులో ఈదురుగాలులకు కింద పడ్డ గర్డర్‌లు

● ఈదురుగాలుల బీభత్సం

ముత్తారం ఏప్రిల్ 23: మండలంలోని ఓడేడు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిల్లపల్లి గ్రామాల మధ్య మానేరు వంతెన గర్డర్లు సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు కుప్పకూలి కింద పడ్డాయి. 2016 ఆగస్టులో అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రూ.49 కోట్ల నిధులతో చేపట్టిన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సదరు కాంట్రాక్టర్ పనులు నత్తనడకన సాగిస్తూ కాలయాపన చేశారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. మరోమారు రెండో దఫాగా రూ.11కోట్ల నిధులను అదనంగా మంజూరు చేసినప్పటికీ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టి కొంత వరకు చేశారు. పిల్లర్ల పైన పెట్టిన గర్డర్‌ల కింది భాగంలో ఉంచిన కర్రలు చాలా కాలంగా అలాగే ఉండంతో చెదలు పట్టి సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు కుప్పకూలి కింద పడ్డాయి. రాత్రివేళ కావడం, జన సంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా, గత సంవత్సరంలో వచ్చిన భారీ వరదలకు పిల్లర్లు కుంగిపోవడమే కాకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో భారీ యంత్రాలు ఇసుకలో కూరుకుపోయాయి.

హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 23: ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగ్‌ల వినియోగంపై నిషేధం విధించిన నగర పాలక సంస్థ అధికారులు మంగళవారం నగరంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్, మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ కె.స్వామి, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను వినియోగిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులపై కేసు నమోదు చేసి 22వేల రూపాయల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.

విద్యుత్ సిబ్బందికి ముగిసిన శిక్షణ

గణేశ్‌నగర్, ఏప్రిల్ 23: టీఎస్ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో రెండు రోజులుగా సిబ్బందికి కొనసాగుతున్న శిక్షణ మంగళవారం ముగిసింది. ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఉద్యోగుల చేత భద్రత నిబంధనలు తప్పకుండా పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయి సిబ్బంది విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మోటివేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి ఒక గంట శిక్షణ ఇచ్చారు.

30 నుంచి ఎంఫార్మసీ పరీక్షలు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 23: ఎస్‌యూ పరిధిలోని ఎం.ఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్30 నుంచి మేనెల 3వ తేదీ వరకు జరగనున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

●బి.ఫార్మసీ ఐదవ మరియు ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల30 నుంచి మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే నెల మొదటి తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఎస్ యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగ ప్రసాద్ ఒక ప్రకటన లో తెలిపారు. మూడు, ఐదవ సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ఎదుట ఖరీదుదారుల ధర్నా

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 23: రైతులకు చెల్లించాల్సిన డబ్బులను పోలీస్‌లు పట్టుకోవడాన్ని నిరసనిస్తూ ఖరీద్‌దారులు వ్యవసాయ మార్కెట్ ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు చెల్లించాల్సిన నగదును బ్యాంకు నుంచి డ్రా చేసి తీసుకు వస్తుండగా పోలీస్‌లు పట్టుకున్నారని తెలిపారు. రైతులకు చెల్లించాల్సిన డబ్బులని చెప్పిన కూడా డబ్బులు పట్టుకోవడం బాధాకరం అన్నారు. ఇలా అయితే తాము రైతుల వద్ద పత్తి కొనుగోలు చేయలేమన్నారు. పత్తి విక్రయించిన రైతులకు డబ్బులు ఎలా చెల్లించాలో చెప్పాలన్నారు. స్పందించిన మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్యానాయక్ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఖరీద్‌దారులు నిరసన విరమించారు.

ఇళ్ల కూల్చివేత కేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్23: నకిలీ ధ్రువ పత్రాలను సృష్టించి అక్రమంగా పలు ఇళ్లను కూల్చి వేసి స్థానికులను భయభ్రాంతులను గురిచేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసి మంగళవారం రాత్రి రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన మొహమ్మద్ లతీఫ్ (38) 2017 జూలైలో కరీంనగర్ రేకుర్తిలోని సర్వే నెంబర్ 194లోని 61వ ప్లాట్, 248 చదరపు గజాల ఇంటి స్థలాన్ని, సిద్దిపేట జిల్లా ప్రశాంత్‌నగర్‌కు చెందిన సయ్యద్ జైనాబీ భర్త నిజామొద్దీన్ నుంచి కొనుగోలు చేశాడు. ఈ స్థలంలో ఇంటి నిర్మాణం కోసం సంబంధిత గ్రామ పంచాయతీలో అనుమతి పొంది ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నాడు. 2023 మే 13న విద్యానగర్‌కు చెందిన బారాజు రత్నాకర్‌రెడ్డి, సాయినగర్‌కు చెందిన చందా శంకర్‌రావు, రేకుర్తికి చెందిన బకిట్ సాయి, జ్యోతినగర్‌కు చెందిన పిట్టల మధు, ముకరంపురకు చెందిన షాహిద్‌ఖాన్ అనే ఐదుగురు వ్యక్తులతో పాటు మరి కొంతమంది దౌర్జన్యంగా ఇంట్లో చొరబడ్డారు. బాధితుడి కుటుంబ సభ్యులను బలవంతంగా ఇంటిలో నుంచి బయటకు నెట్టి వేసి, ఆ ఇంటిని ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేశారు. పక్కనే కాలనీలో ఉన్న మరికొందరి పేదల ఇళ్లు కూడా కూల్చేసి, మీకు ఈ భూమిపై ఎలాంటి హక్కు లేదని చెబుతూ నకిలీ ధ్రువ పత్రాలు చూపించారు. సయీద్ ఖాన్ వారసులతో డెవలప్‌మెంట్ కింద అగ్రిమెంట్ కూడా అయిందని, దానికి సంబంధించిన ఒక నకిలీ జిరాక్స్ అగ్రిమెంట్ డాక్యుమెంట్ కాపీ చూపించారు. వెంటనే ఇళ్లు ఖాళీ చేయాలని లేదంటే చంపేస్తామని బెదిరింపులకు గురి చేశారు. ఈ మేరకు బాధితుడు లతీఫ్ కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన కొత్తపల్లి పోలీసులు విచారణ అనంతరం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు వాస్తవమేనని వెల్లడైనందున ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టాగా 14రోజుల రిమాండ్ విధించారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

● కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

గంగాధర, ఏప్రిల్ 23: రైతులను మోసం చేసిన కాంగ్రెస్ వారిని ఓట్లడిగే హక్కులేదని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్ పార్లమెంటు కిసాన్‌మోర్చా సమ్మేళనం గంగాధరలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ డిసెంబరు వరకు రైతులకు 2లక్షల రుణమాఫీ, వడ్లకు 5వందల బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రైతులకు మొండి చెయ్యి చూపారని ఆరోపించారు. 77ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రైతుల భూములను పాసు బుక్కులో నమోదు చేయలేదని రైతులను ఎలా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. రెతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓట్లు ఎందుకు వేయాలో జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ అభివృద్ధి పనులను బండి సంజయ్ తెచ్చి కరీంనగర్‌లో ప్రారంభిస్తే తానే తెచ్చానని వినోద్‌కుమార్ చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. కరీంనగర్‌లో భూ కబ్జాలలకు పాల్పడ్డ రౌడీ షీటర్లని ధరణి పేరుతో రైతుల నుంచి గుంజిన లంచాలు వాపస్ ఇచ్చి బీఆర్ఎస్ ప్రచారానికి రావాలన్నారు. తాలు తరుగు పేరుతో రైతు కల్లా వద్ద దోచుకున్న బందిపోటు దొంగలకు వినోద్‌కుమార్,కేటీఆర్,కేసీఆర్ నాయకులని విమర్శించారు. దశాబ్దం పాటు పరిపాలించిన రైతుకు అన్యాయం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులకు చింత బరిగెలతో ప్రజలు తరుముతారని హెచ్చరించారు. రైతులకు ఎకరాకు 30వేల ఎరువుల సబ్సిడీ, ప్రతి రైతుకు ఆరువేల కిసాన్ నిధి, నాణ్యమైన విద్యుత్, పంటకు మద్దతు ధర పదేళ్లలో 50 శాతం పెంచిన విషయం, రామగుండం లాంటి ఒక్కో ఎరువుల కర్మాగారాన్ని 6500 కోట్లతో పునరుద్ధరించిన విషయాలను కిసాన్ మోర్చా నాయకులు గ్రామగ్రామాన వివరించాలన్నారు. 12వేల కోట్లతో అభివృద్ధిచేసిన బండి సంజయ్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కిసాన్ మోర్చా నాయకులు కృషి చేయలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో చొప్పదండి ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు, బీజేపీకిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి క్రిష్ణారెడ్డి,బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

కళాకారులకు విరాళం

జూలపల్లి, ఏప్రిల్ 23 : మండలంలోని వడుకాపూర్‌లో నిర్వహించనున్నా చిరుతల రామాయణం నాటక ప్రదర్శన నిర్వాహన కోసం ఆ గ్రామ ముదిరాజ్‌కుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం రామాయణం కళాకారులకు 10వేల రూపాయల విరాళం నగదును అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కనకట్ల స్వామి, జెట్టి సతీష్, తీగల రమేష్, జెట్టి వెంకటేశం, చిక్కుడు స్వామి, ఆకుల కుమార్, బల్ల సత్తయ్య, కనకట్ల శంకరయ్య, కళాకారులు కొమురయ్య, కనకట్ల లచ్చయ్య, సంపత్, మల్లేశం పలువురు పాల్గొన్నారు.

సంకల్ప ప్రతిజ్ఞ

జూలపల్లి, ఏప్రిల్ 23 : కొద్దిరోజుల్లో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త మారం తిరుపతియాదవ్ ప్రజలతో సంకల్ప ప్రతిజ్ఞను చేయించారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, మారం వెంకటరమణ, మేర శ్రీనివాస్, మల్లెత్తుల కనుకయ్య, అమరగాని శ్రీనివాస్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఎంపీ అభ్యర్థులు కరువు

రామగిరి, ఏప్రిల్ 23: కాంగ్రెస్ పార్టీకి ఎంపీ అభ్యర్థులు కరువయ్యారని బీఆర్ఎస్ మంథని ఎన్నికల ఇంచార్జి వోరుగంటి రమణారావు ఎద్దేవా చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకి ఏం అర్హత ఉందని ప్రశ్నించారు. కొప్పుల ఈశ్వర్ ప్రజల మధ్య ఉండే అనుభవం గల ప్రజానాయకుడని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు శంకేషిరవీందర్, నాయకులు పూదరి సత్యనారాయణగౌడ్, మ్యాదరవేని కుమార్, దామెర శ్రీనివాస్, కాపురబోయిన భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

జూలపల్లి, ఏప్రిల్ 23 : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ప్రతిఒక్కరు పోలింగ్‌లో పాల్గొనాలని డిప్యూటీ తహసీల్దార్ అబుబాకర్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామస్తులకు ఆయన ఓటరుపై అవగాహన కల్పించారు. అధికారులు ప్రజలతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామప్రజలకు, ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో ఓటరుపై అవగాహన కల్పించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు సదయ్య, శ్రవంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, గ్రామస్థులు పాల్గన్నారు.

రంగనాయక స్వామి పొన్న సేవ

సుల్తానాబాద్, ఏప్రిల్ 23: నీరుకుళ్లలోని భూనీళా సమేత శ్రీరంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలలో మంగళవారం పొన్నసేవ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. మానేటి నదీ తీరాన వెలసిన శ్రీ మానేటి రంగనాయక స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో పౌర్ణమి తిథిని పురస్కరించుకుని పొన్నసేవ జరిగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. బుధవారం బండ్లు తిరిగే కార్యక్రమం, డోపు కథ జరుగుతాయి.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

అంతర్గాం, ఏప్రిల్ 23: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి, ఎగ్లాస్‌పూర్ గ్రామాల్లో మంగళవారం పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా స్థానిక రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామి కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు ఉరిమెట్ల రాజలింగం, పెండ్యాల మహేష్, మద్ది తిరుపతిగౌడ్, గాదె సుధాకర్, ఒల్లెపు సాయి పాల్గొన్నారు.

ఆలయంలో ప్రభుత్వ విప్ పూజలు

జూలపల్లి, ఏప్రిల్ 23 : మండలంలోని పెద్దాపూర్ గ్రామ పరిధిలోగల శ్రీయోగానందా లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర వేడుకలను పురస్కరించుకుని మంగళవారం ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయంలో పూజారులచే ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కుల రవిందర్‌రెడ్డి, సీపెల్లి గోపాలక్రిష్ణ, ఎంపీటీసీ దండె వెంకటేశం ఉన్నారు.

వడదెబ్బ నివారణ మాత్రల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 23: సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్ఎంఎస్ ప్లాంట్ ఉద్యోగులకు వడదెబ్బ నివారణకు హోమియో మందులకు పంపిణీ చేశారు. ఒకసారి ఈ మాత్ర తీసుకుంటే నెలరోజుల వరకు వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకోగలమని సభ్యులు తెలిపారు. లింగమూర్తి, నూక రమేష్, శరవణ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మంథనిలో ప్రత్యేక అలంకరణలో హనుమాన్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతి సందర్భంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పలు హనుమాన్ ఆలయాలు రామనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల్లో దర్శనం కోసం బారులు తీరారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జవహర్‌నగర్‌లోని హనుమాన్ ఆలయంలో రామగుండం ఎమ్మెల్యే మాక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంముఖి ఆంజనేయస్వామి ఆలయం, 45వ డివిజన్‌లో అన్నదాన కార్యక్రమంలో మక్కాన్‌సింగ్ పాల్గొన్నారు. పంచముఖి హనుమాన్ దేవాలయంలో కరిమిండ్ల లక్ష్మణ్‌రావు అన్నదానం నిర్వహించారు. కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, కొలిపాక సుజాత, బాల రాజ్‌కుమార్, కొమ్ము వేణు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, నాయిని ఓదెలు, పాతిపెల్లి రవి, తిప్పారపు శ్రీనివాస్, కుడిదెల శివ, కొలిపాక మల్లయ్య, ఎర్రగొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. 48వ డివిజన్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా కార్పొరేటర్ పొన్నం విద్యలక్ష్మణ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కోఆప్షన్ సభ్యురాలు తానిపర్తి విజయలక్ష్మి, గోపాల్‌రావు, ప్రకాష్, రఘుపతి, రాజేందర్, శ్రీను, నాని, యాదగిరి పాల్గొన్నారు. చంద్రశేఖర్‌నగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా హనుమాన్ జయంతిని నిర్వహించారు. మొట్లపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఐబీ కాలనీ, జీఎం కాలనీ, ఉదయ్‌నగర్, మార్కండేయకాలనీలలోని పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంథని : చిన్న హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. భక్తులు హనుమాన్, వైష్ణవ ఆలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీక్షాపరులు భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా నూతన వస్త్రాలు, తమ్మలపాకులు, పూలతో హనుమాన్ విగ్రహాలను ప్రత్యేకంగా ఆలంకరించి పూజలు నిర్వహించారు. ఎక్కాం భజనలు నిర్వహించారు. స్థానిక పెంజేరుకట్టలోని హనుమాన్, బలవీర హనుమాన్, రావుల చెరువుకట్ట, తమ్మిచెరువు, వాగుగడ్డ, నడివీధిలోని బాలహనుమాన్, లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలోని, గోదావరినది తీరంలోని, ఎరుకలగూడెంలోని హనుమాన్ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. దీంతో హనుమాన్ ఆలయాలన్ని భక్తులతో సందడిగా మారాయి.

ఓదెల : మండలంలోని పలు గ్రామాల్లో రామబంటు హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చీకటి తోట ఆంజనేయస్వామి, పద్మశాలి వీధిలోని అభయాంజనేయస్వామి, మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రామినేని రాజేంద్రప్రసాద్, మేకల రవి, మేకల సతీష్, శివ, ఆంజనేయస్వామి దీక్షపరులు పాల్గొన్నారు.

జూలపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లోను హనుమాన్ జయంతిని మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వడుకాపూర్ తదితర గ్రామాల్లోని హన్‌మాన్ దీక్షపరులు, ప్రజలు కలిసి గ్రామాల్లో హన్‌మాన్ శోభయాత్రలను నిర్వహించారు.

యైటింక్లయిన్‌కాలనీ : చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక భక్తాంజనేయ ఆలయంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సుమంత్ ఆచార్యులు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మహమ్మాయి దేవి బ్రహ్మోత్సవాలు



అమ్మ వారి జాతరలో పోటెత్తిన భక్తులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 23: మండలంలోని చిన్న కలువల గ్రామంలో శ్రీ మహమ్మాయి అమ్మవారి జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. బహ్మోత్సవాలు ఈనెల 19న ఉమా మహేశ్వర స్వామివారల కల్యాణోత్సవంతో ప్రారంభం అయ్యాయి. మంగళవారం అమ్మవారి జాతర ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు నిరంతరంగా భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు దేవరకొండ కృష్ణమాచార్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

ఏసీసీ, ఏప్రిల్ 23: మంచిర్యాల పట్టణంలోని శ్రీశ్రీనగర్‌కు చెందిన కాజిపేట శ్రీనివాస్(52) ప్రభుత్వ ఉపాధ్యాయుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సోమవారం రాత్రి కుమారుడిని మంచిర్యాల బస్టాండ్‌లో దింపేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా రాత్రి 12.30గంటలకు ఓవర్ బ్రిడ్జి దిగుతుండగా కారు ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడు మంథని మండలం చందనాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారని తెలిపారు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

'బీఆర్ఎస్ అవినీతి పాలనకు ఓడేడు వంతెన నిదర్శనం'



గర్డర్‌లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం ఏప్రిల్ 23: బీఆర్ఎస్ అవినీతి పాలనకు ఓడెడ్ వంతెన నిర్మాణం నిదర్శనమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, ఓడేడు మాజీ సర్పంచ్ సిరికొండ బక్కారావు అన్నారు. వంతెన వద్ద కులిపోయిన గర్డర్‌లను కాంగ్రెస్ నాయకులతోపాటు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓడేడు, గర్మిళ్ళపల్లి గ్రామాలను కలుపుతూ 2016ఆగస్టులో 49 కోట్లతో మంజూరు చేసి, మళ్లీ రెండో దఫాగా రూ.11 కోట్లు కూడా మంజూరుచేసి ఎంతో ఆర్భాటంగా పనులు ప్రారంభించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, ఆరోజు శాసనసభ్యులుగా ఉన్న ప్రస్తుత జడ్పీ చైర్మన్ పుట్ట మధు ఈ బ్రిడ్జిని 24నెలల్లో పనులు పూర్తి చేసి ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రజల ఆకాంక్ష నెరవేస్తానని గొప్పలు చెప్పాడన్నారు. కానీ కాంట్రాక్టర్లను ఇబ్బందిపెట్టి అందరు బీఆర్ఎస్ నాయకులు కమిషన్ల తీసుకొని సదర్ కాంట్రాక్టర్ ఎలా పనిచేస్తున్నారని చూడకుండా నాణ్యత లోపించినా పర్యవేక్షణ చేయకుండా చూసీచూడనట్లు వదిలేయడం వల్లనే బ్రిడ్జి పరిస్థితి ఇలా ఉందన్నారు.

ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ జడ్పీ చైర్మన్ పుట్ట మధు తన పదవికి రాజీనామా చేయాలని సింగిల్‌విండో చైర్మన్ యాదగిరిరావు, ముత్తారం మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు గాదం శ్రీనివాస్ ముత్తారం మాజీ సర్పంచ్ రఫీ రజిత మరియు ఓడేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 23: గోదావరిఖని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మంగమ్మ పేర్కొన్నారు. అంతర్గాం, జీడీనగర్, బసంత్‌నగర్, కన్నాలలో ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ మోసిన్ అలీ, రామగుండం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పావని దాడులు జరిపారని, ఈ దాడుల్లో 1200లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారన్నారు. 10లీటర్ల నాటుసారా, 5కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారని, ఒక మహిళలపై కేసు నమోదు చేశారన్నారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ ఖదీర్, కొండాల్‌రావు, వాజిద్, కానిస్టేబుళ్లు రవీందర్, ఖాజా ఇబ్రహీం, శ్రావణ్, రాజు, సుధాకర్, మమత, నవీన్ పాల్గొన్నారు.

శ్రీవాణిలో గ్రాడ్యుయేషన్ డే

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 23: స్థానిక శ్రీవాణి విద్యానికేతన్ గ్రాడ్యుయేషన్ డే మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు హాజరై చిన్నారులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మణ్‌కుమార్, ప్రిన్సిపాల్ మానస, పోషకులు పాల్గొన్నారు.

అలరించిన స్పందన స్కూల్ డే

స్థానిక స్పందన మోడల్ స్కూల్ వార్షికోత్సవం మంగళవారం రాత్రి స్థానిక సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఓదేలు, ప్రిన్సిపాల్ రవీందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తూ తనిఖీలు నిర్వహించాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 23: ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటిస్తూ వాటిని అమలు చేస్తూ చెక్ పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని పెద్దపల్లి జిల్లా సరిహద్దు గ్రామమైన దుబ్బపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టును కలెక్టర్ మంగళవారం రాత్రి వాహన తనిఖీలను పర్యవేక్షించారు. విదుల్లో ఉన్న అధికారులకు సిబ్బందికి పలు సలహాలు సూచనలు అందజేశారు.

'కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయాలు తీసుకోవాలి'

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 23: బీఆర్ఎస్ నాయకత్వం కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయాలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు, సీనియర్ నాయకుడు కొంకటి లింగమూర్తి పేర్కొన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన వారికే ఎంపీ అభ్యర్థులుగా అవకాశం ఇస్తే పార్టీ శ్రేణులు ఉత్సాహం చూపడం లేదని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మాదిగల ఓట్లు అధికంగా ఉన్నాయన్నారు. తనకు అవకాశం ఇస్తే మాదిగ జాతి మద్దతు ఇస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో రేణికుంట్ల సతీష్ ఉన్నాడు.

పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఓదెల, ఏప్రిల్ 23 : మండలంలోని కనగర్తి దాసరి పద్మ హన్మయ్య హైస్కూల్ అభివృద్ధి పనులకు మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కొత్తూరి శిరీష శంకుస్థాపన నిర్వహించారు. ఎన్నికల నిబంధనల రాకముందు పాఠశాలలో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.7లక్షల 80వేల ప్రభుత్వ నిధులను కేటాయించారు. నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్, కార్యదర్శి సందీప్ ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. ఇకనుండి పాఠశాల కమిటి ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుందని ప్రధానోపాధ్యాయులు రమేష్ తెలిపారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 23: మండలంలోని 30 గ్రామాల్లో వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు డీఎల్‌పీవో వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య తలెత్తితే ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో చేతిపంపులు, మిషన్ భగీరథ పైప్ లైన్‌లు మరమ్మత్తులు ఉంటే తక్షణమే చేయించాలని కార్యదర్శులకు సూచించారు. ప్రజలను నీటి ఎద్దడి లేకుండా ప్రతి అధికారి అలర్ట్‌గా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్, ఎంపీవో సుదర్శన్, ఏపీవో రమేష్ బాబు, తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

గ్రామపంచాయతీల పరిధిలో నూతనంగా గృహ నిర్మాణాలు చేపట్టుకునే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని డీఎల్‌పీవో వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని రాఘవపూర్‌లో అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదు మేరకు ఎంపీవో సుదర్శన్‌తో కలిసి డీఎల్‌పీవో వేణుగోపాల్ విచారణ చేపట్టారు. అనుమతులు లేకుండా నిర్మించిన గదిని సిబ్బందితో కూల్చి వేయించారు.

'ట్రినిటి'లో ఫేర్‌వెల్ డే హంగామా



ట్రినిటి పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 23: మండలంలోని కాసులపల్లి ట్రినిటి పాఠశాలలో మంగళవారం ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెలబ్రేషన్స్ 2024 పేరుతో నిర్వహించిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆడప బాపురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ధర్మారం, ఏప్రిల్23: ధర్మారం మండలం దొంగతుర్తి హైస్కూల్ హెచ్ఎం అనురాధను మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానం చేశారు. హెచ్ఎం ఈనెల 30న పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా మంగళవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈవో ఛాయాదేవి, నోడల్ అధికారి ప్రభాకర్, పీఎస్ హెచ్ఎం సత్తయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 23: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి సురేందర్ కుమార్, ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి సిరిమల్ల మహేష్‌తో కలిసి పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. పలువురు విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. హెచ్ఎంలు నరెడ్ల సునీత, ఈర్ల సమ్మయ్య, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పర్సు అప్పగింత

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 23: కొరియర్ బాయ్ పోగొట్టుకున్న పర్సును కాపులపల్లి పంచాయతీ కార్యదర్శి మౌనిక తిరిగి బాధితుడికి అప్పగించారు. మండలంలోని కాపులపల్లి గ్రామానికి ఆన్‌లైన్ బుక్ చేసుకున్న వస్తువులను డెలివరీ చేసేందుకు వచ్చిన బాయ్ జేబు నుంచి పర్సు కింద పడిపోయింది. గమనించిన పంచాయతీ కార్యదర్శి మౌనిక కొరియర్‌బాయ్ వివరాలు తెలుసుకొని అతన్ని గ్రామ పంచాయతీ కార్యలయానికి పిలిపించి డబ్బులు, ఏటీఎం, ఆధార్ కార్డులతో కూడిన పర్సును అందించారు.

'ఫుడ్ పాయిజన్ కారకులపై చర్యలు తీసుకోవాలి'

సుల్తానాబాద్, ఏప్రిల్ 23: సుల్తానాబాద్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల హాస్టల్‌లో ఇటీవల ఫుడ్ పాయిజన్ సంఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ హాస్టల్స్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్‌తో పాటు నాయకులు బండి రాజశేఖర్, అరవింద్ డిమాండ్ చేశారు. మంగళవారం సుల్తానాబాద్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్‌లో ఈనెల 19న 25 విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కారణంగా అసుపత్రి పాలయ్యారన్నారు. ఇందుకు హాస్టల్‌లో విధుల్లో ఉన్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను, కేర్ టేకర్‌ను, వంట సరుకుల పంపిణీ కాంట్రాక్టర్‌పై, వంట సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు.

ఎన్‌సీపీ తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేకల శ్రీధర్

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 23: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జీగా ఎన్‌టీపీసీ కాజిపల్లికి చెందిన మేకల శ్రీధర్ నియామితులయ్యారు. ఈ మేరకు ఎన్‌సీపీ జాతీయ అధ్యక్షులు అజిత్ పవార్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సునీల్ జాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తనను నియమించిన, తన నియామకానికి సహకరించిన ఎన్‌సీపీ జాతీయ అధ్యక్షులు అజిత్ పవార్, రాష్ట్ర అధ్యక్షులు సునీల్ జాదవ్‌లకు శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఎన్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని శ్రీధర్ పేర్కొన్నారు.

ఆలిండియా ట్రెకింగ్ యాత్రకు ఖని ఎన్‌సీసీ కెడెట్లు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 23: తమిళనాడు రాష్ట్రం ఊటీలో వారం రోజుల పాటు జరుగనున్న ఆలిండియా ట్రెకింగ్ యాత్రకు గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ కెడెట్లు ఎంపికయ్యారు. వారం రోజుల పాటు జరిగే యాత్రకు కెడెట్లు ఎస్.రితిక , సాధ్వి శౌర్య, నర్తన పాల్గొనున్నారని ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న తెలిపారు. కాగా పాఠశాలకు చెందిన కెడెట్లు జాతీయ ట్రెకింగ్ యాత్రకు ఎంపిక కావడం పట్ల మంగళవారం పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ లవ్‌లీజాకబ్, ప్రిన్సిపల్ జ్యోత్స్నపాలెపు, ప్రైమరీ ఇంచార్జీ ఇన్నమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.



నేడు గోదావరిఖనిలో టీబీజీకేఎస్ మహాసభలు

గోదావరిఖని, ఏప్రిల్ 23: అనేక ఉత్థాన పతనాలను, ఆటుపోట్లను, అంతర్గత సంక్షోభాలను ఎదుర్కొన్న టీబీజీకేఎస్ శిథిలమైన దశలో పునర్ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలోనే బుధవారం గోదావరిఖనిలో తన మహాసభను ఏర్పాటు చేసుకున్నది. ఈ మహాసభలో టీబీజీకేఎస్ పునర్ నిర్మాణంతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. ఈ క్రమంలోనే నిన్న మొన్నటి వరకు టీబీజీకేఎస్ అధ్యక్షునిగా పని చేసిన బీ వెంకట్రావ్ కాంగ్రెస్‌లో చేరారు. ఆయన అనుచరులగా టీబీజీకేఎస్‌లో ఉన్న చాలా మంది నాయకులు, ఆ నాయకులకు సంబంధించిన మంగళవారం సింగరేణి వ్యాప్తంగా టీబీజీకేఎస్‌కు రాజీనామాలు చేస్తున్నట్టు ప్రకటనలు చేశాయి. ఆర్జీ-1 ఉపాధ్యక్షులు గండ్ర దామోదర్, ఆర్జీ-3 ఉపాధ్యక్షులు శంకర్‌లాంటి వారు చాలా మంది ఉన్నారు. ఇలాంటి సందర్భంలోనే ఉద్యమ నేపథ్యం నుంచి ఎదిగిన నాయకులు మిగులుతారని, అవకాశవాదులు వెళిపోతారని టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దీంతో పాటు నేటి మహాసభలను విజయవంతం చేయాలని కూడా స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి కోరారు.

టీబీజీకేఎస్‌కు ఆర్జీ-3 ఉపాధ్యక్షుడి రాజీనామా

రామగిరి, ఏప్రిల్ 23: సింగరేణి సంస్థ ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు గౌతంశంకరయ్య టీబీజీకేఎస్ యూనియన్, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వనికి రాజీనామా చేశారు. ఐఎన్‌టీయుసీలో క్రియాశీలకంగా వ్యవహరించిన గౌతం కొన్ని అనివార్య కారణాలతో ఐఎన్‌టీసీని వీడి టీబీజీకేఎస్ యూనియన్‌లో చేరారు. టీబీజీకేఎస్‌లో సైతం చురకైన పాత్రను పోషించి అనతి కాలంలోనే ఆర్జీ-3 డివిజన్‌కు ప్రాతినిధ్యం వహించారు. కాగా, టీబీజీకేఎస్ యూనియన్‌లోని అగ్ర నాయకత్వంలో ఉన్న పక్షపాత ధోరణి నచ్చక సంఘానికి, బీఆర్ఎస్‌లకు రాజీనామా చేసినట్లు గౌతం శంకరయ్య తెలిపారు. త్వరలోనే కాంగ్రెస్‌లో చేరి వెంకట్రావ్ బాటలో కొనసాగుతానని తెలిపారు.

శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 23: సింగరేణి యాజమాన్యం కార్మిక వాడలకు శుద్ధి చేసిన స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని సీఐటీయూ ఆర్జీ-2 సెక్రెటరీ ప్రవీణ్ కుమార్, ప్రెసిడెంట్ వినయ్, సంపత్, రాంప్రసాద్, నర్సింహారావులు ప్రకటనలో పేర్కొన్నారు. సీఐటీయూ బృందం ఆర్జీ-2 ఫిల్టర్ బెడ్‌ని పరిశీలించిందని, అక్కడ నీటిని ఫిల్టరింగ్ చేయడం లేదని తెలిపారు. ఆర్జీ-1 ఏరియా నుంచి వస్తున్న నీటినే నేరుగా కార్మిక వాడలకు సరఫరా చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇదేవిషయమై సివిల్ అధికారులను ప్రశ్నించగా ఆర్జీ-1లో నీటిని ఫిల్టరింగ్ చేసి పంపుతున్నారని దాటవేస్తున్నట్టు తెలిపారు. వెంటనే తాగు నీటిని ఫిల్టరింగ్ చేసి మాత్రమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

సుందిళ్ల కేంద్రంగా మట్టి మాఫియా

- సింగరేణి ఓసీపీ-5 కోసం సేకరించిన భూముల్లో తవ్వకాలు



అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టరు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 23: సుందిళ్ల కేంద్రంగా మట్టి మాఫియా కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.. గోదావరిఖనికి చెందిన కొందరు కొందరు వ్యక్తులు ఓసీపీ5కి సింగరేణి సేకరించిన భూముల్లో నుంచి యంత్రాలతో తవ్వకాలు జరుపుతూ ప్రతి రోజు వందల ట్రిప్పుల మట్టిని అమ్ముకుంటున్నారు. బయట వ్యక్తులకు పట్టా ల్యాండ్‌గా చెబుతూ తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రామగిరి రెవెన్యూ అధికారులు సింగరేణి ఆర్జీ-1 సెక్యూరిటీ యంత్రాంగం ఈ దందాకు పూర్తి సహకారాలు అందిస్తున్నట్టు ట్రాక్టర్ల యజమానులే పేర్కొంటున్నారు. ఎలాంటి సీనరేజ్ చెల్లించకుండానే, వే బిల్లులు లేకుండానే ఈ దందా సాగుతుంది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రజల నిర్మాణ అవసరాలను అడ్డుగా పెట్టుకుని ఒక మట్టి ట్రిప్పుకు రూ.1000 వరకు అమ్ముకుంటున్నారు. ప్రతి రోజు లక్షల రూపాయల వ్యాపారం సాగుతున్నట్టు తెలుస్తున్నది. రెవెన్యూ, ఎస్టేట్ విభాగాలకు మామూళ్లు చెల్లించాలంటూ ట్రాక్టర్ల యజమానుల నుంచి లోడింగ్‌కే రూ.300 నుంచి రూ.400 వసూలు చేస్తున్నారు. ప్రతి రోజు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

సింగరేణి వైఖరితోనే...

సింగరేణి సంస్థ స్థానిక అవసరాలకు ఓబీ కుప్పల నుంచి స్థానిక ట్రాక్టర్లకు మట్టి ఇచ్చేది. దీంతో రేట్లు కూడా అందుబాటులో ఉండేవి. సింగరేణి యాజమాన్యం ఈ విధానానికి స్వస్తి పలుకడంతో మట్టి అందుబాటులో లేని పరిస్థితి ఉంది. దీన్ని ఆసరగా చేసుకుని కొందరు సింగరేణి సెక్యూరిటీ, ఎస్టేట్‌ల అండతో సింగరేణి భూముల నుంచే మట్టి తవ్వకాలు జరిపి దందా సాగిస్తున్నారు.

పట్టుకుంటున్నారు.. వదిలేస్తున్నారు..

మట్టి అక్రమ తవ్వకాలపై గ్రామస్థుల ఫిర్యాదులతో అక్కడికి వచ్చిన రెవెన్యూ, సింగరేణి ఎస్టేట్ సిబ్బంది ట్రాక్టర్లను పట్టుకోవడం, ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వదిలేయడం పరిపాటిగా మారింది. చర్యలు తీసుకోకపోతుండడంతో దందా ఏడాదిగా నిరాటంకంగా సాగుతోంది.

టీబీజీకేఎస్‌ను కార్మికులు ఆదరించాలి

- స్టీరింగ్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి

గోదావరిఖని, ఏప్రిల్ 23: సింగరేణి కార్మికుల కష్టాలలో భాగస్వామ్యం పంచుకునే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని ఆదరించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక యూనియన్ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా సింగరేణి కార్మికుల సమస్యల సాధనకు పోరాడుతున్న తీరును కార్మికులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన హక్కులను సైతం సాధించిన ఘనత టీబీజీకేఎస్‌దేనని స్పష్టం చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు అమలు కావడం వల్ల సింగరేణి ప్రాంత బిడ్డలకే ఉద్యోగ అవకాశాలు దక్కాయని, మహిళలకు ఉద్యోగాలు కల్పించడం, అంగవైకల్యం పొందిన వారికి కూడా డిపెండెంట్ ఉద్యోగాలు ఇప్పించిన ఘనత కూడా తమ సంఘానిదేనని పేర్కొన్నారు. యూనియన్ నిర్మాణాన్ని విస్తృతపరిచి బలమైన కార్మిక సంఘంగా తీర్చిదిద్దడానికి బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రతినిధుల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆరు జిల్లాలలో విస్తరించి ఉన్న సింగరేణి సంస్థకు చెందిన 11 డివిజన్ల నాయకులు, కార్యకర్తలు హాజరవుతారని ఆయన వెల్లడించారు. ఈ సమావేశ ప్రాంగణానికి కొప్పుల లక్ష్మీరాజం పేరును ఖరారు చేశామని, యూనియన్ నిర్మాణంలో మొదటి నుండి పనిచేసి అమరులైన నాయకులను స్మరించుకుంటూ అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర సభల ప్రారంభ సూచికగా యూనియన్ జెండాను ఎగరవేస్తామని, అనంతరం జరిగే సభలో 11 డివిజన్లకు చెందిన ముఖ్య నాయకుల ప్రసంగాలు, వార్షిక నివేదిక, చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం సింగరేణి సంస్థను కాపాడుకోవటం, కార్మిక హక్కులు సాధించుకోవడం, రాజకీయ పరిస్థితులపై తీర్మానాలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఈ సమావేశంలో కార్మిక నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, పర్లపల్లి రవి, చల్ల రవీందర్‌రెడ్డి, సురేందర్, బొగ్గుల సాయి, పులిపాక శంకర్ పాల్గొన్నారు.